క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ వెంటే అట్టడుగు వర్గాలు



తిర్రే బాబూరావు

నరసాపురం: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర బడుగు వర్గాల వారు వైఎస్సార్ సీపీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని ఏపీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం నరసాపురం శాఖ అధ్యక్షుడు తిర్రే బాబూరావు అన్నారు. నరసాపురంలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రకు అపూర్వ స్పందన రావడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దళితులు, బీసీలతో సహా అన్ని వర్గాల వారు సీఎం జగన్ సాగిస్తున్న ప్రజారంజక పాలనకు అండగా ఉన్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ చేస్తున్న బస్సుయాత్రకు అన్ని ప్రాంతాల్లో ప్రజల నుంచి వస్తున్న ఆదరణ ఇందుకు నిదర్శనమన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి గతంలో వచ్చిన 23 సీట్లు కూడా రావని, ఈ విషయం టీడీపీ నాయకులకు ఇప్పటికే అర్థమైందని పేర్కొన్నారు.

పంటురేవు ఆదాయం మున్సిపాలిటీకే చెందాలి



కామన ధనంజయ

నరసాపురం: నరసాపురం వశిష్ట గోదావరి పంటురేవు ఆదాయం మున్సిపాలిటీకి చెందేలా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ మాజీ అధికారి, సామాజిక కార్యకర్త కామన ధనుంజయ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి పంటు రేవు ప్రాంతం మున్సిపాలిటీ పరిధిలో ఉందన్నారు. పట్టణం నడిబొడ్డున పంటు రేవు ఉంటే, పంటు రేవు ద్వారా వచ్చే కోట్లాది రూపాలయ ఆదాయం మండల పరిషత్‌కు వెళ్లడం సరికాదన్నారు. రేవు వద్ద లైటింగ్ , పారిశుద్ధ్యం వంటి సదుపాయాలు కూడా మున్సిపాలిటీనే అందిస్తుందని చెప్పారు. ఎప్పుడో బ్రిటీష్ కాలం నుంచి ఈ ప్రాంతం మాధవాయిపాలెం పేరుతో రికార్డ్స్‌లో ఉండటాన్ని ఆసరాగా చేసుకుని ఆదాయం మున్సిపాలిటీకి చెందకుండా చేయడం పద్ధతి కాదన్నారు. ఈ అంశంపై ఎమ్మెల్యే, ఉన్నతాధికారులకు తాను ఫిర్యాదు చేశానని, గతంలో కూడా అనేక మంది పోరాడారని చెప్పారు. ఉన్నతాధికారులు కలుగజేసుకుని సమస్య పరిష్కరించాలని కోరారు.


అమ్మవారి పూజా కుంకుమ అందజేత



సిద్ధాంతం బస్టాండ్ సెంటర్‌లో పసుపు, కుంకుమను పంపిణీ చేస్తున్న దృశ్యం

పెనుగొండ: సిద్ధాంతం బస్టాండ్ సెంటర్‌లో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద పసుపు, కుంకుమ, గాజులకు మహిళలు పోటెత్తారు. ఆదివారం సాయంత్రం ఆలయం వద్ద కమిటీ వారిచే మహిళలకు తొమ్మిది రోజుల పాటు అమ్మవారి పూజలలో వినియోగించిన పసుపు, కుంకుమ, గాజులు, రవిక పంపిణీ చేశారు. వేలాది మంది మహిళలు వీటిని అందుకోవడానికి పోటీ పడ్డారు. ఈ సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 5 వేల మందికి పైగా అన్న ప్రసాదం స్వీకరించారు.

ప్రోటోకాల్ పాటించాలి



ఆచంట వేమవరంలో మాల మహానాడు సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: మాల మహానాడులో పదవి ఉన్న ప్రతీ ఒక్కరూ ప్రోటోకాల్ పాటించకపోతే క్రమ శిక్షణ చర్యలు ఉంటాయని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ హెచ్చరించారు. ఆదివారం ఆచంట వేమవరంలో జరిగిన మాల మహానాడు సమావేశంలో పాల్గొన్నారు. గత కొద్దిరోజులుగా అంబేడ్కర్ విగ్రహ వివాదం, ప్రోటోకాల్ పాటించకుండా దురుసుగా ప్రవర్తించినందుకు గానూ కమిటీ నుంచి సంస్థ గౌరవ అధ్యక్షుడిను తొలగించినట్లు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య ప్రకటించారని వివరించారు. పదవి ఉన్నవారు తప్పని సరిగా ప్రోటోకాల్ పాటించాలని సూచించారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం



పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న పెన్మెత్స బుద్ధరాజు

పాలకొల్లు అర్బన్: మండలంలోని అరట్లకట్ట గ్రామానికి చెందిన బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న తోటకూర పద్మని, అలాగే పోడూరు గ్రామానికి చెందిన రుద్రరాజు స్వరూప వర్మలకు హైదరాబాద్‌కు చెందిన పీఎల్‌రాజు కన్‌స్ట్రక్సన్స్ అధినేత వర్మ రూ.10వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సహాయాన్ని పీఎల్‌రాజు బంధువు పెన్మెత్స బుద్ధరాజు, చెరుకూరి సత్యనారాయణ రాజు తదితరులు విద్యార్థులకు అందజేశారు.

తీరప్రాంతంలో విద్యుత్ కష్టాలకు చెల్లు

- కొత్తగా మరో 3 ఇంటర్నల్ సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలకు నిధుల మంజూరు
- ఇప్పటికే నిర్మాణంలో ఉన్న 220/132/11 కేవీ భారీ సబ్‌స్టేషన్
- ఇక లో–ఓల్టేజ్ సమస్యలకు చెక్



నరసాపురం పట్టణంలోని ప్రస్తుత విద్యుత్ సబ్ స్టేషన్

నరసాపురం: నరసాపురం తీర ప్రాంత గ్రామాల్లో రానున్న 30 ఏళ్లపాటు నాణ్యమైన విద్యుత్ నిరాటంకంగా సరఫరా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం బీజం వేసింది. ఇప్పటికే నరసాపురం పట్టణంతో పాటుగా పాలకొల్లు, భీమవరం చుట్టుప్రక్కల గ్రామాల్లో కూడా విద్యుత్ లో–ఓల్టేజ్ సమస్యలకు చెక్ పెడుతూ రూ.133 కోట్లుతో 10 ఎకరాల స్థలంలో 220/132/11 కేవీ భారీ సామర్థ్యంతో రుస్తుంబాదలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ పనులు కూడా ప్రారంభమయ్యాయి. మళ్లీ తాజాగా మూడు సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలకు ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కృషితో శ్రీకారం చుట్టారు. నరసాపురం అర్బన్‌లో జగనన్న కాలనీకి ప్రత్యేకంగా రూ.2.60 కోట్లుతో 33 కేవీ సబ్‌స్టేషన్ మంజూరు చేశారు. వీటి పనులు ప్రారంభమయ్యాయి. అలాగే మరో రెండు చోట్ల నవరసపురం, చిట్టవరం గ్రామాలకు సంబంధించి రూ.2.40 కోట్లుతో 10 ఎంవీ సబ్‌స్టేషన్, మొగల్తూరు మండలం కాళీపట్నం, జగన్నాథపురం గ్రామాలకు సంబంధించి రూ.2.40 కోట్లుతో 10 ఎంవీ సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ రెండు సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలు కూడా కొన్ని రోజుల్లోనే ప్రారంభం కాబోతున్నాయి.

2019 వరకూ ఇలా

2019 తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నంత వరకూ నియోజకవర్గంలో మొత్తం 50 ఎంవీ సామర్థ్యంతో మాత్రమే సబ్‌స్టేషన్‌లు అందుబాటులో ఉండేవి. దీంతో తీర గ్రామాల వారు విద్యుత్ వెతలు వర్ణనాతీతంగా ఉండేవి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన ఈ సుమారు నాలుగేళ్ల కాలంలోనే 5 ఎంవీ సామర్థ్యంతో ఉండే మొగల్తూరు, కొత్తోట, ఎల్‌బీచర్ల, తూర్పుతాళ్లు, కేపీపాలెం గ్రామాల్లోని 5 సబ్‌స్టేషన్‌ల సామర్థ్యాన్ని 10 ఎంవీకి రెట్టింపు చేస్తూ అభివృద్ధి చేసింది. నరసాపురం పట్టణంలో ఉండే 132/11 కేవీ సబ్‌స్టేషన్‌లో 50 ఎంవీఏ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కు అదనంగా మరో 80 సామర్థ్యంతో ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి మొత్తం 130 ఎంవీఏకు పెంచారు.

జగనన్న ప్రభుత్వంలో ఇలా

ఇప్పుడు అదనంగా ముఖ్యమంత్రి జగన్ శంకుస్థాపన చేసిన మరో 50 ఎంవీఏ సామర్థ్యంతో 220/132/11 కేవీ సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. అంటే 2019లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కేవలం 50 ఎంవీఏ సామర్థ్యంతో ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు ఏకంగా 400 ఎంవీఏ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లతో విద్యుత్ సబ్‌స్టేషన్‌లు అభివృద్ధి చెందుతున్నాయి. కొత్తగా నిర్మిస్తున్న 220/132/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి నరసాపురం, పాలకొల్లు, భీమవరం, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాలకు ఇక్కడి నుంచే విద్యుత్ సరఫరా సాగనుంది. ఇక ఇటీవల కాలంలో ఒక్క నరసాపురం నియోజకవర్గంలోనే 200 మంది ఆక్వా రైతులకు వారి అభ్యర్థన మేర ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చారు. ఆక్వా రంగాన్ని కూడా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఆక్వా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలోనే సబ్‌స్టేషన్ నిర్మాణాలు



నరసాపురం నియోజకవర్గంలో రూ.7.40 కోట్లుతో మూడు విద్యుత్ సబ్ స్టేషన్‌లకు నిధులు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తి కావంతో పట్టణంలోని జగనన్న కాలనీలో ఓ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సీఎం జగన్ శంకుస్థాపన చేసిన రుస్తుంబాధలో రూ 133 కోట్లుతో 10 ఎకరాల స్థలంలో 220/132/11 కేవీ సబ్‌స్టేషన్ పనులు కూడా మొదలవుతున్నాయి. నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, భీమవరం, యలమంచిలి మండలాల ప్రజలకు రానున్న 30 ఏళ్లపాటు ఇక ఎలాంటి విద్యుత్ కష్టాలు ఉండవు. నరసాపురం తీర ప్రాంత గ్రామాలోని 5 సబ్‌స్టేషన్‌లలో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని రెట్టింపు చేశాం.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్‌విప్

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

నరసాపురం రూరల్: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. పశ్చిమగోదావరి జిల్లా నుంచే కాకుండా తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి భక్తులు వచ్చారు. ప్రైవేటు వ్యక్తులు, దేవస్థానం వారు నిర్మించిన వంట షెడ్లన్నీ భక్తులతో నిండిపోయాయి. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ చైర్మన్, మేనేజర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేపు పాలకొల్లులో అష్టావధానం

పాలకొల్లు అర్బన్: రసధుని, క్షత్రియ సంక్షేమ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9.30గంటలకు క్షత్రియ సంక్షేమ పరిషత్ భవనంలో 'అష్టావధానం' నిర్వహించనున్నట్లు రసధుని అధ్యక్షుడు కొట్టి భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శతావధాని బలుసు అపర్ణ అవధాన ప్రక్రియను నిర్వహిస్తారన్నారు. సహస్రావధాని కడిమెళ్ల వరప్రసాద్ సంచాలకులుగా వ్యవహరిస్తారన్నారు.

8న పాలకొల్లులో సామాజిక సాధికార యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: పాలకొల్లులో నవంబర్ 8న నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను ప్రతి కార్యకర్త తమ భుజస్కందాలపై వేసుకుని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పిలుపు నిచ్చారు. బస్సుయాత్ర కార్యాచరణపై ఆదివారం పట్టణంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ భవన్‌లో వార్డు ఇన్‌చార్జ్‌లు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని కార్యకర్తలకు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. పాలకొల్లులో నిర్వహించే బస్సుయాత్రపై అధిష్టానం ఎంతో నమ్మకం పెట్టుకుంటుందన్నారు. ఈ బస్సుయాత్రకు నియోజకవర్గంలోని పాలకొల్లు పట్టణం, పాలకొల్లు మండలం, పోడూరు, యలమంచిలి మండలాల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని కోరారు. బస్సుయాత్రలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మంత్రులు పాల్గొంటారన్నారు. బస్సుయాత్ర పూలపల్లి మలుపు వద్ద నుంచి 8వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి గాంధీబొమ్మల సెంటర్‌లో సాయంత్రం 5 గంటలకు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ప్రతీ వార్డు నుంచి కనీసం 500 మంది గాంధీ బొమ్మల సెంటర్‌కు చేరుకునేలా బాధ్యత తీసుకోవాలని కోరారు. సమావేశంలో చింతలపూడి, దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, యూత్ అధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఖండవల్లి వాసు, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, ఆలయాల చైర్మన్‌లు కోరాడ శ్రీనివాసరావు, కావలి శ్రీనివాసరావు, జోగి వెంకటేశ్వరరావు, నంబూరి శ్రీగంగా పవన్‌కుమార్, మామిడి వెంకటేశ్వరరావు (బాబు), పార్టీ నాయకులు అడబాల వెంకటరమణ, మద్దా చంద్రకళ, కొర్రగింజల శ్రీనివాసరావు, బండి రమేష్, చినిమిల్లి గణపతిరావు, జోగాడ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు చిత్రకారులకు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



చిత్రకారుడు కొసనా భాస్కరరావును సత్కరిస్తున్న ఒంగోలు ఆర్ట్ ఫెస్టివల్-2023 నిర్వాహకులు

పాలకొల్లు అర్బన్: ఒంగోలు ఆర్ట్ ఫెస్టివల్–2023 మెగా పోర్ట్రేట్ ఈవెంట్ వరల్డ్ రికార్డు, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులో పలువురు పాలకొల్లు చిత్రకారుల పేర్లు నమోదైనట్లు ప్రముఖ చిత్రకారుడు కొసనా భాస్కరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తనతో పాటు చిత్రకారులు కడలి శ్రీనివాస్, చెల్లబోయిన రాము, నక్కా వెంకట్, బుడితి రామారావులు ఈ లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులో పేరు నమోదైనట్లు తెలిపారు. చిత్రకళలో విశేష సేవలందించిన డి.రామకృష్ణ (రాఖీ) స్థాపించిన వపా బాపు ఆర్ట్ అకాడమీ– పాలకొల్లుకు ఆర్ట్ గెలాక్సీను అందజేసి సత్కరించినట్లు తెలిపారు. ఈ అవార్డును పాలకొల్లు చిత్రకారులు అందుకున్నట్లు ఆయన తెలిపారు.

మేడపాడులో ఊరేగింపు సందడి



మేడపాడు కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాన్ని ఎడ్ల బండి వాహనంపై ఊరేగిస్తున్న దృశ్యం

యలమంచిలి: దసర శరన్నవరాత్రులలో భాగంగా మేడపాడు గ్రామంలోని కాలనీలో ఏర్పాటుచేసిన కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహ నిమజ్జన కార్యక్రమం ఆదివారం జాతరను తలపిస్తూ ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి విగ్రహాన్ని రెండు భారీ ఎడ్ల బొమ్మలున్న వాహనం మీదకు ఎక్కించారు. ఈ వాహనానికి వెనుక వైపు ఆవు దూడ బొమ్మలు ఏర్పాటు చేశారు. వీటితోపాటు విచిత్ర వేషధారణలు, డీజే, తీన్‌మార్ డప్పులు ఏర్పాటు చేసి గ్రామమంతా ఊరేగించారు. ఎడ్లు, ఆవు దూడ బొమ్మలతో కూడి వాహనం ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా నవంబర్ 1న భారీ అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ల నియామకం



విప్పర్తి ప్రభాకరరావు



పితాని సత్యనారాయణ (చిన్న)

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్‌గా విప్పర్తి ప్రభాకరరావును, అలాగే పోడూరు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్‌గా పితాని సత్యనారాయణ (చిన్నా)లను నియమించినట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) ఆదివారం విలేకరులకు తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయం నిర్ణయం మేరకు వీరిని నియమించినట్లు పేర్కొన్నారు. నూతన కన్వీనర్లు ఆయా మండలాల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు తూర్పుతాళ్లులో జగనన్న ఆరోగ్య సురక్ష

నరసాపురం రూరల్: మండలంలోని తూర్పుతాళ్లు గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ ఆదివారం విలేకరులకు తెలిపారు. గ్రామంలోని పీఎం లంక రోడ్డులో ఉన్న గ్రామ సచివాలయం.2 వద్ద జరిగే ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన స్పెషలిస్టు వైద్యులు వచ్చి రోగులకు సేవలందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మట్లపాలెంలో

యలమంచిలి: మండలంలోని మట్లపాలెం, గంగడుపాలెం గ్రామాలకు సంబంధించి సోమవారం మట్లపాలెం గ్రామంలోని పేరిచర్ల సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాతూరి బుచ్చిరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ప్రారంభిస్తారన్నారు. శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తారని, గ్రామ ప్రజలు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని బుచ్చిరాజు కోరారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



ఆటల పోటీను ప్రారంభిస్తున్న ఉయ్యూరు ఆర్డీవో దాసి రాజు

సాక్షి, భీమవరం: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని కలిగిస్తాయని, ఆటలకు వయస్సుతో పనిలేదని ఉయ్యూరు ఆర్డీవో దాసి రాజు అన్నారు. భీమవరం లూథరన్ హైస్కూల్లో ఏపీ బహుజన జేఏసీ 3వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలను ఆర్డీవో ప్రారంభించి మాట్లాడారు. వార్షికోత్సవం సందర్భంగా జేఏసీ సభ్యులు ఐకమత్యంతో వివిధ రకాల క్రీడలను ఏర్పాటు చేసుకుని ఉల్లాసంగా ఉత్సాహంగా గడపడం ఆనందించదగిన విషయమన్నారు. గౌరవాధ్యక్షుడు కాటం స్టాన్లీ రాజు, జెఏసి అధ్యక్షులు కొనా జోసఫ్, తాళ్లూరి మధు మాట్లాడుతూ పురుషులకు క్రికెట్, కబడ్డీ, కోకో, మహిళలకు మ్యాజిక్ చైర్స్ పోటీలను నిర్వహించామని గెలుపొందిన వారికి బహుమతులను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఈది రవికుమార్, కోనా రంజిత్, బిరుదుగడ్డ రమేష్ బాబు, మాజీ కౌన్సిలర్ పాలవెల్లి మంగ తదితరులు పాల్గొన్నారు.

నేడు మేడపాడులో ఉచిత నేత్ర వైద్య శిబిరం

యలమంచిలి: మండలంలోని మేడపాడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రాబ్యాంకు రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భీమవరం యూనిట్ కన్వీనర్స్ బుద్ధరాజు వెంకట పతిరాజు, ఆకెన కేశవరావులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి నగరంలోని వేమగిరి ప్రాంతంలో ఉన్న పరమహంస యోగానంద నేత్రాలయ సంస్థ వైద్యులు ఈ శిబిరంలో పరీక్షలు చేస్తారన్నారు. పరీక్షలు అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇవ్వడమే కాకుండా ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తారని వారు వివరించారు. ఆంధ్రాబ్యాంకు శతజయంతోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. మేడపాడు పరిసర గ్రామాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఆక్వా సదస్సుకు పీవీఎల్‌కి ఆహ్వానం



పీవీఎల్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సీఈఓ వేణు

కాళ్ల: వచ్చేనెల 2వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కాళ్ల మండలం పెద అమిరంలో ఆక్వా ఎక్స్‌పో ఇండియా ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆక్వా ఎక్స్‌పో సీఈవో దంతులూరి వేణు ఆదివారం తెలిపారు. నవంబర్ 2, 3, 4 తేదీల్లో పెద అమిరం రోడ్డులోని రాధాకృష్ణ కన్వెన్షన్ సెంటర్‌లో ఆక్వా ఎక్స్‌పో కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజును పెద అమిరం పార్టీ కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ఎక్స్‌పోలో 100 స్టాళ్లకు పైగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాళ్ళ, పాలకోడేరు ఎంపీపీలు పెనుమత్స విశ్వనాథరాజు, భూపతి రాజు చంటిరాజు, కుముదవల్లి సర్పంచ్ వంశీకృష్ణంరాజు, సాగిరాజు హరి వర్మ, కలిదిండి బుజ్జి, పెనుమత్స శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

కొప్పర్రు సొసైటీ మాజీ ప్రెసిడెంట్ తంబి మృతి



నరసాపురం రూరల్: మండలంలోని కొప్పర్రు సహకార సంఘ మాజీ అధ్యక్షుడు పోలిశెట్టి విజయకుమార్ (తంబి) ఆదివారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. హైదరాబాద్ వెళ్లి హెల్త్ చెకప్ చేయించుకుని తిరిగి స్వగ్రామానికి వస్తున్న సమయంలో ట్రెన్‌లో గుండెపోటు రావడంతో అకాల మరణం చెందారు. మృతుడు తంబి గ్రామెంలోని సహకార సంఘానికి కొంతకాలం అధ్యక్షుడిగానూ, మరి కొంతకాలం పాలకవర్గ సభ్యుడిగా సేవలందించారు. మృతుడు తంబికి భ్యార్య, కుమారు, కుమార్తె ఉన్నారు. తంబి మృతిపట్ల సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు బాబా, సభ్యులు చొప్పల సూర్యప్రకాష్ (జపాన్). పాకా రమాదేవి, మాజీ అధ్యక్షుడు పోలిశెట్టి మధు, రైతు సంఘం నాయకుడు చినమిల్లి వీర బాబు, అందే కవికుమార్ తదితరులు సంతాపం తెలిపారు.

నేడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంలు నుంచి స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని నరసాపురం ఆర్డీఓ ఎం.అత్యుత్ అంబరీష్ ఆదివారం విలేకరులకు చెప్పారు. ప్రజలు తమ విజ్ఞప్తులు, ఫిర్యాదులు అందించాలని కోరారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

కులాల వారీగా జనగణన చేపట్టాలి

- బీసీ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు

పాలకోడేరు: కేంద్ర ప్రభుత్వం వెంటనే కులాల వారీగా జనగణన చేపట్టాలని బీసీ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. సంఘ సమావేశాన్ని గొల్లలకోడేరులో మండలాధ్యక్షుడు దొమ్మేటి వేణుగోపాల్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన విషయంలో కేంద్ర ప్రభుత్వం కుంటి సాకులు చెబుతోందని విమర్శించారు. బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చే వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. స్థానిక సంస్థల్లో కచ్చితంగా 34 శాతం రిజర్వేషన్ కొనసాగించాలన్నారు. దేశంలో అనేక కులాలు రిజర్వేషన్ లేకపోతే ఆర్థికంగా ముందుకు సాగలేవని ఉద్దేశంతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించారన్నారు. దేశంలో ఎన్నో కులాలు ఉంటే కేవలం 10 కులాలు మాత్రమే అసెంబ్లీ, పార్లమెంట్ గడపలు తొక్కుతున్నాయని అన్నారు. అగ్రవర్ణాలకు రిజర్వేషన్ ప్రకటించడం ద్వారా బీసీలను ముంచినట్లేనని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో అసలు రిజర్వేషన్‌కి అర్థం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిప్పాడా చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు కుక్కల సత్యానారాయణ, ప్రధాన కార్యదర్శి కండిబోయిన సుబ్రమణ్యం, మండల ఉపాధ్యక్షుడు నేతల గోపి, గౌరవాధ్యక్షుడు గులిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొప్పర్రులో అన్నసమారాధన

నరసాపురం రూరల్: దసరా శరన్నవరాత్రుల ముగింపు వేడుకలను పురస్కరించుకుని నరసాపురం మండలంలోని కొప్పర్రు గ్రామంలో సుబ్రహ్మణ్వేర స్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి అఖండ అన్న సమారాధన నిర్వహించారు. అలాగే మొగల్తూరు మండలంలోని పేరుపాలెంనార్త్ రజకులపేటలో ఏర్పాటు చేసిన అమ్మవారి పీఠం వద్ద కూడా ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

బాంబు నిర్వీర్యంపై మాక్ డ్రిల్

సాక్షి, భీమవరం: పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు పర్యవేక్షణలో బాంబు నిర్వీర్యంపై మాక్ డ్రిల్‌ను భీమవరం బస్టాండ్ ఆవరణలో ఆదివారం నిర్వహించారు. ప్రయాణికులను ఆ ప్రాంతానికి రానివ్వకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, బాంబును ఎలా గుర్తించాలో వివరించారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.